

# అనాథ

కె. మృణాళిని

“ లౌక్యంలేదమ్మా. నాకా ఆలోచనే బాగులేదు ” శర్వాణి అలసటగా అంది. తనింకా అక్కడే కూర్చుంటే సంభాషణ పొడిగించాల్సి వస్తుందేమోనని లేచి, తన గదిలోకి వెళ్ళిపోయింది. స్టాండు మీద వున్న బట్టలు తీసి మడతపెట్టసాగింది.

“ నేను చెప్పింది నీ కసలు అర్థంకావడం లేదు, శారూ ” వైదేహి గొంతు వినిపించి, తలెత్తింది. తల్లి తన వెనకే వచ్చినట్టుంది. తలుపు దగ్గర నించుని వుంది.

“ అర్థం కాకపోవడానికి నేనేం పసిదాన్నా ” శర్వాణికి విసుగ్గా అనిపించింది.

వైదేహి నవ్వింది.

“ పసివాళ్ళకే అర్థంచేసుకునే శక్తి వుందదంటావా? నీకే కాదు. ఈనాటికి నాకూ అర్థంగాని విషయాలు చాలా వున్నాయి. అది వేరే విషయం గానీ... ముందలా కూర్చో ” అంటూ తను డ్రెస్సింగ్ టేబిల్ దగ్గరున్న కుర్చీ లాక్కుని కూర్చుంది.

శర్వాణి కూర్చోలేదు. బట్టలు నిదానంగా మడుస్తూ, వించుంది. వైదేహి తలెత్తి ఒకసారి కూతురి కేసి చూసి, మెల్లగా అంది. "నే నొకటడుగుతాను, చెప్తావా ?"

శర్వాణి మాట్లాడలేదు. వైదేహి ఒక్క క్షణం ఆగి, "అనాథశరణాలయంలో పిల్లలు బాగుండరని నువ్వెందుకనుకుంటున్నావ్ ?" అని అడిగింది.

"బాగుండరని నే నన్లేదు. అందంగానే వుండొచ్చు. కానీ....ఏ కులమో, తల్లిదండ్రులెవరో, ఎక్కడ దొరికారో....ఏమీ తెలీకుండా ఎలా పెంచుకుంటామమ్మా ?"

"ఆ వివరాలు తెలుసుకొని ఏం చేస్తావు ?"

"ఏం చేస్తానన్నది తర్వాతి విషయం. ఏ భిక్షగాడి పిల్లో, రోగిష్ఠిపిల్లో అయితే ? ఆ తర్వాత బాధపడాల్సింది నేనేగా ?....ఊహూఁ...." తల అడ్డంగా తిప్పింది శర్వాణి.

"అదంతా చెక్ చేయకుండా ఎలానూ బిడ్డను తీసుకోం కద, శారూ ? ఆరోగ్యంగా వున్న పిల్లనే తెచ్చుకుందాం" వైదేహి అనునయంగా అంది.

శర్వాణి మంచం మీద కూలబడినట్టుగ కూర్చుంది.

"నీకు తెలీదమ్మా. ఆరోగ్యం ఒకటే కాదు. ఎటువంటి వంశంలో పుట్టిందో తెలీకుండా ఎలా ? వంశపారంపర్యంగా వచ్చే దుర్గుణాలు నువ్వెంత బాగా పెంచినా పోవు....ఊహూఁ....ఎంతకాలమైనా సరే. నాకు బాగా తెలిసిన కుటుంబం నుంచే బిడ్డను తెచ్చుకుంటాను."

"సరే. నీ కెన్నో కుటుంబాలు తెలిసుండొచ్చు. కానీ.... వాళ్ళలో ఎంతమంది తమ బిడ్డలను పెంపకాని కివ్వడానికి సిద్ధంగా వున్నారో ఆలోచించావా ?"

"అందరూ ఇస్తారని నేను మాత్రం ఎందుకంటాను ? అదికాదు. మొన్న పద్మ కనిపించింది. సుమతి వాళ్ళ పరిస్థితి మరీ దిగజారి పోతోందిట. 'ఈ అయిదుమంది పిల్లలతో వేగలేకుండా వున్నానని' పద్మ దగ్గర వెళ్ళబోసుకుందిట సుమతి. పద్మ నా సంగతి చెప్పి, చిన్న కూతుర్ని శర్వాణికి పెంపకాని కిస్తావా అని అడిగిందట...." శర్వాణి ఆగింది.

"ఊఁ ?" వైదేహి సూటిగా చూసింది. శర్వాణి కాస్సేపు మాట్లాడలేదు.

"ఏమందట సుమతి ?" నెమ్మదిగా అడిగింది వైదేహి.

"ఆలోచించి చెప్తానందిట... అంటే.... పద్మ ఇలా అడిగినప్పుడు సుమతి భర్త ఊళ్ళో లేడమ్మా. ఆయన వచ్చాక అడుగుతానంది" శర్వాణి తల వంచుకుని అంది.

"నీ మాటల్ని నువ్వే నమ్మలేకపోతున్నావ్. ఇంకా నాకు చెప్పాలని చూస్తున్నావా, శారూ ?.... ఫర్వాలేదు. చెప్పు. సుమతి ఒప్పుకోలేదు కదూ ?"

శర్వాణి తలెత్తింది.

"ఇప్పటివరకూ అంతేననుకో. కానీ ఇంకా వత్తిడి చేస్తే ఒప్పుకుంటుందేమో."

"ఒప్పుకోవచ్చు. కానీ ఆ తర్వాత సుమతి ఎంత బాధపడుతుందో ఆలోచించావా ? ఇలాంటి పనులు డబ్బుతో సాధించలేం, శారూ."

శర్వాణి చిరాగ్గా అంది.

"ఇందులో తప్పేముందమ్మా. తనకు అయిదుమందిని పోషించే స్తోమత లేదు. ఆ స్తోమత వున్న వాళ్ళు ఒక పిల్లను పెంచుకుంటామంటే బాధెందుకు ? ఒక బిడ్డయినా మహారాణిలా బతుకుతుందని సంతోషించాలి ఇంకా."

వైదేహి తీవ్రంగా చూసింది, కూతురి కేసి.

"ఈ మాటలు నాతో అంటే అన్నావ్. ఇంకెక్కడా అనకు" వెంటనే మార్దవంగా మారిపోయింది ఆమె గొంతు. "శారూ ! నువ్వెంత ప్రాక్టికల్‌గా ఆలోచించినా, కొన్ని విషయాల్లోనైనా సున్నిత భావాలనేవి ఉంటాయని గ్రహించాలి...." కూతురి కళ్ళలో నీళ్ళు కనిపించి, చటుక్కున ఆగిపోయింది. తల్లికి తన కన్నీళ్ళు కనిపించడం ఇష్టం లేక, శర్వాణి తల తిప్పేసుకుంది. బొంగురుపోతున్న గొంతుతో అంది—

"ఆ సున్నిత భావాలే లేకపోతే నే నెంతో హాయిగా వుండేదాన్ని. పిల్లలు లేని వాళ్ళంతా నాలాగే వుండరు. ఎంతో బాధపడినా, ఆ జీవితానికి అలవాటుపడతారమ్మా చాలామంది. నాలా విషయం తెలిసిన రెండో క్షణం నుంచీ ఇల్లు ఇల్లూ తిరగరు."

శర్వాణి మళ్ళీ తల్లి వైపుకు తిరిగేసరికి, కళ్ళు మామూలుగా వున్నాయి.

"ఇందాక నేనన్న మాటలు...." ఆగి, మళ్ళీ అంది, "నా బాధను ఇంకొకరి మీద కోపంగా చూపించడంలో అర్థం లేదు."

వైదేహి చిన్నగా నిట్టూర్చింది. తర్వాత అంది. "మనం అసలు విషయం వదిలేసాం, శారూ. నా మట్టుకు నాకు నువ్వేదైనా అనాథశరణాలయం నుంచి పాపనో, బాబునో తెచ్చుకుంటే బావుండునని వుంది. కనీసం ఒక అనాథకు రక్షణ నిచ్చినట్లైనా వుంటుంది."

"నేను పిల్లను పెంచుకుంటానన్నది నా కోసం గానీ, ఎవరినో ఉద్ధరించడం కోసం కాదమ్మా. ఆ విషయం నీకూ తెలుసు" శర్వాణి లేచి నుంచుంది. "అమ్మా, నీ మాట కాదంటున్నందుకు నీకు కోపం రావచ్చు. కాని, నా మనసులో మాట చెప్తున్నాను. నిన్ను నొప్పించలేక ఒకవేళ శరణాలయం నుంచి తెచ్చుకున్నా.... ఇంతకూ పెంచాల్సింది నేను. ఆ బిడ్డ ఏ త్రాగుబోతు కొడుకో, వేశ్య కొడుకో, రోగిష్ఠి కొడుకో, ఎంత నీచకులానికి చెందినవాడో అని రోజూ మథనపడుతూ వుంటే, ప్రేమగా చూడగలనంటావా ?....ఊహూఁ....ఇక ఆ ప్రసక్తి వదిలెయ్."

"శారూ. ఈ తరం మనిషిలా మాట్లాడడం లేదు నువ్వు. ఆ బిడ్డ తల్లిదండ్రులెలాటి వాళ్ళైతేనేం ? దానికి బిడ్డ బాధ్యతేం లేదుగా ? నీ పెంపకంలో మంచి మనిషిగా తీర్చిదిద్దు. నీ మీద నీకా మాత్రం నమ్మకం లేదా ? ఒక నెలల పిల్లపై–అందులోనూ తల్లిదండ్రులెవరో తెలీని పిల్ల.... ఆ బిడ్డపై, వాళ్ళ ప్రభావం ఏమాత్రం వుంటుంది ? వాళ్ళ గుణగణాల గురించి నువ్వంత ఆలోచించడం దేనికో నా కర్థం కావడం లేదు...."

శర్వాణి మధ్యలోనే అందుకుంది.

"నీకు నేను చెప్పేంతదాన్ని కానేమో కానీ.... మనిషికి కొన్ని గుణాలు వారసత్వంగా వస్తాయని నేను నమ్ముతాను. నేనీ తరానికి చెందినదాన్నే అయినా, సంప్రదాయం, వంశం, తల్లిదండ్రుల స్వభావాలు-ఇవన్నీ బిడ్డల జీవితాన్ని తీర్చిదిద్దడంలో ఎంతో ముఖ్యమైనవిగా కనిపిస్తాయమ్మా. నావి మూఢ నమ్మకాలని నువ్వనుకున్నా సరే, నీకిదివరకే చెప్పాను. మళ్ళీ చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదు. ఎప్పటికైనా తెలిసిన వాళ్ళు, వీలైనంతమట్టుకు మన కులం వాళ్ళ నుంచే పాపనో, బాబునో తెచ్చుకుంటాను" మాట పూర్తి చేస్తూనే బయటకు వెళ్ళిపోయింది శర్వాణి.

*

మర్నాటి వుదయం. వంటపని చేసుకుంటోంది వైదేహి. శర్వాణి వచ్చి గడపమీద కూర్చుంది.

"కింద కూర్చో, శారూ. అలా కూర్చో

కూడదు" వైదేహి కుక్కర్ మీద వెయిట్ పెడ్తూ అంది. శర్వాణి వెంటనే నేలమీద జారగిల పడినట్టు కూర్చుంది. చిన్నగా నవ్వి అంది –

"ఈ నమ్మకాలు మాత్రం నీకింకా పోలేదమ్మా"

వైదేహి వెనక్కి తిరక్కుండానే అంది, "ఈ నమ్మకంవల్ల నష్టం లేదుకదా, శారూ."

తల్లి మాటల్లో ద్వంద్వార్థం తోచి, కొంచెం చిరాగ్గా అనిపించింది శర్వాణికి. తన అభిప్రాయం తల్లికి నచ్చలేదని తెలుస్తూనే వుంది. కాని తన యిష్టం, తన భర్త యిష్టం.

ఈ విషయంలో భర్త తనకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చినపుడు, ఆ గౌరవం దక్కించుకోవాలి. కానీ ఈ సమస్యనెలా పరిష్కరించుకోవాలో తనకర్థం కావడంలేదు. తల్లి సహకారం లభిస్తుందనే ఆశతో ఇంత దూరం వచ్చింది. ఈ రోజే మద్రాసుకు తిరిగి వెళ్ళిపోవడానికి టిక్కెట్టు కూడ బుక్ అయిపోయింది. తల్లికీ విషయంలో అంత పట్టుదల ఎందుకుందో అర్థం కావడం లేదు. పైగా తన మీద కోపం కూడా వచ్చినట్టుంది. శర్వాణికి నిస్సత్తువగా, నిరాశగా అనిపించింది. తల్లి తన బాధనర్థం చేసుకోదేం?

"బట్టలు సర్దుకున్నావా?" తల్లి ప్రశ్న వినిపించి, ఆలోచనల్లోంచి తెప్పరిల్లింది.

"ఆఁ. అన్నీ రెడీగానే వున్నాయి....అమ్మా" తటపటాయిస్తున్నట్టుగా అంది.

"ఏం?"

"నేను మళ్ళీ ఇప్పట్లో హైదరాబాద్ రావడానికి కుదరదు. నువ్వు సుమతిని కనుక్కుంటావా?" తల్లి ముఖం జాగ్రత్తగా పరిశీలిస్తూ అడిగింది.

వైదేహి ముఖ కవళికల్లో ఎటువంటి మార్పు లేదు. "ప్రయత్నిస్తాను. కాని నాకంత నమ్మకం లేదు" తల్లి ఇంకా ఏదో చెప్పబోయి, ఆగిపోయి నట్టనిపించింది శర్వాణికి.

మధ్యాహ్నం మూడు గంటలు. తండ్రి ఆటో తేవడానికి వెళ్ళగానే; శర్వాణి తల్లి దగ్గరికి వచ్చింది.

"అమ్మా నీ మాట విననందుకు కోపం వచ్చిందా?" నెమ్మదిగా అంది.

వైదేహి తల అడ్డంగా తిప్పింది.

"కోపం కాదు. నువ్వు సరిగ్గా ఆలోచించలేక పోతున్నావని అనిపిస్తోంది."

శర్వాణికి తల్లి ఏదో చెప్పబోయి, ఆగిపోతోందని



# రకరకాల విత్తనాలతో ఆర్ట్‌పీస్

గృహిణులకు తీరిక సమయాల్లో చేతిలో ఏదో ఒక పని ఉండాలి. లేకుంటే ఏమీ తోచక అవస్థ పడతారు. అలాంటప్పుడు ఎక్కువ ఖర్చులేనిది, చేయడం సులభంగా ఉండేదైతే ఎవరికైనా ఉత్సాహమే! ఫొటోలో ఉన్న 'వాల్‌ప్లేట్' కూడా అలాంటివాటిల్లో ఒకటి. ఇది చేయడం చాలా తేలిక, అంతేకాదు. ఖర్చు కూడా బహు స్వల్పం. చేశాక చాలా బాగుందని అందరూ మెచ్చుకుంటారు కూడా. మనం తలుచుకోవాలే కాని, ఇది ఒక అరగంటలో తయారైపోతుంది.

కావలసిన వస్తువులు: అంచులున్న ప్లాస్టిక్ ప్లేటు (అది ఏ షేప్‌లో ఉన్నా పరవాలేదు. అంచులు లేకున్నా పనికొస్తుంది), సన్నని తీగ-½ మీటర్ (ఫ్యూజ్‌వైర్ ఉపయోగించవచ్చు), విత్తనాలు (గుమ్మడి, అనప, సపోట, దోస, బీన్స్, కాకర, పుచ్చ మొదలైనవి. గోధుమలు, ధనియాలు, శెనగలు కూడా వాడవచ్చు), రెండు, మూడు రంగుల ఫాబ్రిక్ పెయింట్స్, కోట్ బటన్స్-3, పాంట్ బటన్స్-4, ఫెవికాల్.

తయారు చేసే విధానం: ముందుగా ప్లేటుకు మధ్యలో, పై భాగాన రెండు రంధ్రాలు పొడవాలి. (సూదిని వేడి చేసి ప్లేట్ మీద పొడిస్తే రంధ్రమేర్పడుతుంది). తరువాత వైర్ తీసుకుని దానిలో దూర్చి తగిలించడానికి కొక్కెం చేయాలి. తరువాత ప్లేట్‌కు సెంటర్లో ఒక కోట్ బటన్‌కు వైర్ దూర్చి, క్రిందికి దించి పురితిప్పాలి. దీన్ని కొక్కానికి చేసిన రంధ్రాల మీద ఫెవికాల్ వేసి అంటించాలి. అలాగైతే ఆ రెండు రంధ్రాలు కనిపించవన్నమాట. తరువాత దీనికి అన్నిటికన్నా పెద్ద విత్తనాలు ఫెవికాల్‌తో అంటించాలి. అప్పుడు పువ్వులాగా కనిపిస్తుంది. దాని తరువాత సైజులు తగ్గిస్తూ రావాలి (ఫొటోలో చూపిన విధంగా) సెంటర్ వైర్‌కు ఇరువైపులా కూడా కోట్ బటన్సే వాడాలి. వీనికి తగినట్లుగా విత్తనాలు అంటించాలి. ఉదాహరణకు సెంటర్‌లో సపోట విత్తనాలు ఉపయోగిస్తే, ఆ తరువాత కాకర, బీన్స్ ఉపయోగించవచ్చు. ఆ తరువాత గుమ్మడి, పుచ్చకాయ విత్తనాలు, తరువాత దోస, [illegible] ఉపయోగిస్తే చూడటానికి బాగుంటుంది. కాని ఇక్కడ రాసిన విధంగానే అతికించాలన్న రూలులేదు. ఎవరి ఇష్టానికి తగినట్లు వారు ఆయా విత్తనాలను ఉపయోగించవచ్చు. ఇలా అతికించాక క్రింద కొంచెం పెద్దగా ఉన్న విత్తనాలను అతికించాలి. (అర్థచంద్రాకారంలో) ఆ తరువాత విత్తనాల మధ్య ఉన్న ఖాళీభాగంలో మిరియాలు కాని, ధనియాలు కాని అంటించవచ్చు. (పుప్పొడిలాగ అన్నమాట) ఇప్పుడు వాటికి రంగులు వేయలి. వీటికి రెండు మూడు రంగులుంటే చాలు. ఎందుకంటే ఆ మూడు రంగులను ఆల్టర్‌నేట్‌గా వేసి, తరువాత రెండు రంగులను కలిపితే మిశ్రమ రంగులొస్తాయి. వాటిని మిగతావాటికి వేయవచ్చు. (ఉదాహరణకు రెడ్, వైట్ కలిపితే పింక్, ఎల్లో, రెడ్ కలిపితే ఆరెంజ్ మొదలైనవి) పుప్పొడికి పసుపురంగు వాడితే బాగుంటుంది. ఇక ఈ ప్లేట్‌ను గోడకు తగిలిస్తే చూడటానికి చాలా అందంగా కన్పిస్తుంది. అందర్నీ ఆకర్షిస్తుంది. చేసి చూడండి!

—ఆర్. సంధ్య

అనిపించింది. చెప్తుందేమోనని, పని లేకపోయినా కొంతసేపు అక్కడే నించుంది.

ఇంతలో ఆటో ఆగిన శబ్దం వినిపించడంతో శర్వాణి బయిటికి వచ్చింది. వైదేహి, పని మధ్యలో ఆపి, చేతులు కొంగుకి తుడుచుకుంటూ, కూతురి వెనకే వచ్చింది.

శర్వాణి ఆటోలో కూర్చుంది. ఆటో బయల్దేరుతుండగా, ముందుకు వంగి, అంది,

"అమ్మా, వెళ్ళొస్తా. త్వరగా లెటర్ రాయి. మర్చిపోకేం?"

*

లెటర్ విప్పింది శర్వాణి. పెద్దగానే వుంది వుత్తరం. సోఫాలో చేరగిలపడి కూర్చుని, చదవసాగింది.

"ప్రియమైన శారూ,

నువ్వు మద్రాసు చేరినప్పట్నుంచి నా వుత్తరం కోసం ఎదురు చూస్తున్నావని తెలుసు. సుమతిని ఎన్ని సార్లు కదిలించినా, మాట దాటేస్తుంది తప్ప, సూటిగా సమాధానం చెప్పడం లేదు. దీన్ని బట్టి తెలుస్తోంది. తనకు బిడ్డను పెంపకానికివ్వడం ఇష్టంలేదని, నువ్వింక ఆ విషయంలో ఆశ వదులుకోవడం మంచిది.

శర్వాణీ, నువ్విక్కడ వున్న ఆ వారంరోజులూ, నేను నీకెన్నో విషయాలు చెప్పాలనుకున్నాను. కాని వాటి పరిణామాలు ఎలా వుంటాయోననే భయంతో తటపటాయించాను. బాగా ఆలోచించి, చివరికి చెప్పడానికే నిశ్చయించుకున్నాను.

ఏ విషయమో నీకు ఈ సరికి అర్థమైవుంటుంది. నువ్వు అనాథ శరణాలయం నుంచి బిడ్డను తెచ్చి పెంచుకోవాలని నాకెంతగానో వుంది. నేనెందుకంత మొండిపట్టుదల చూపిస్తున్నానో నీకర్థం కావడం లేదుకదూ. ఏనాటికైనా ఈ విషయం చెప్పాల్సిన అవసరం వస్తుందని నేననుకోలేదు. బహుశా చెప్పేయడం మంచిదేమోనని ఇప్పుడనిపిస్తూ వుంది.

శారూ, నేను చెప్పే విషయం నీకెంతో బాధ కలిగించవచ్చు. కాని తొందరపడి మనసు పాడు చేసుకోకు. కొంచెం ఆలోచిస్తే, అందులో బాధపడాల్సింది ఏమీ లేదని నీకే అర్థమౌతుంది.

శారూ, నువ్వు నా కన్న కూతురివి కావు."

శర్వాణి కళ్ళు అక్షరాలవెంట పరుగులు తీయడం మానేశాయి. ముప్ఫైసెకన్లు గడిచాయి. ఆమె కళ్ళకు చలనం వచ్చింది. ఉత్తరం ముందుకు సాగింది. "....నిన్ను అనాథ శరణాలయం నుంచి తెచ్చి పెంచుకున్నామమ్మా. ఈ రహస్యం ఇంత కాలం నీ నుంచి ఎందుకు దాచామని నువ్వు ప్రశ్నించవచ్చు. దానికి పెద్ద కారణమేం లేదు. ఆ అవసరం కన్పించలేదు.

నువ్వు ఈ రోజు నీ దురదృష్టం అనుకుంటున్నది, నీ తల్లిది కూడా అని చెప్పలేక ఇన్నాళ్ళు మానసికంగా ఎంతో వ్యధ అనుభవించాను. నాకు ఒకసారి అబార్షన్ అయ్యాక, నా శరీరబలహీనత వల్ల మళ్ళీ గర్భం ధరించడం ప్రమాదకరమన్నారు డాక్టర్లు. మీ నాన్నగారు ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ రోజు నువ్వు పడుతున్న బాధ చూస్తోంటే నాకు ఆనాడు నేను పొందిన చిత్రహింస పునరావృతమవుతున్నట్టే అనిపించింది.

పరిస్థితులు ప్రతికూలంగా వున్నప్పుడు, వాటికి తలవొగ్గి నిర్వికారంగా వుండడమో, లేక వాటిని తప్పించుకునే మరో మార్గం చూసుకోవడమో- ఈ రెండింటిలో ఏదో వొక మార్గాన్ని మనిషి అనుసరించాలి, శారూ. నేను రెండవ మార్గాన్నే ఎన్నుకున్నాను. నేను బిడ్డల్ని కనలేకపోవచ్చు. కాని బిడ్డల్ని ప్రేమించే హక్కు నాకుందిగా? దాన్ని నా నుంచి తీసుకునే అధికారం ఆ భగవంతుడికి కూడా లేదు. ఆ ఒక్క నమ్మకమే నేను కృంగిపోకుండా నన్ను కాపాడింది.

నీలాగే నేను కూడా మంచి సంప్రదాయం, తెలిసిన కుటుంబం -ఇవన్నీ చూసే పిల్లను తెచ్చుకోవాలనుకున్నాను. కాస్త ప్రయత్నిస్తే, నాకా అవకాశం వచ్చేదేననుకుంటాను. కాని మీ నాన్నగారు మొదట్నుంచీ అనాథ శరణాలయం నుంచి బిడ్డను తెచ్చుకుందామని పోరుపెట్టారు. ఒకసారెప్పుడో అనాథ శరణాలయం వాళ్ళ స్కూలులో ఏదో ఫంక్షన్‌కు అధ్యక్షత వహించి, వాళ్ళ పరిస్థితిని చూసినప్పట్నుంచీ ఆయనకు వాళ్ళకేవిధంగానైనా సహాయం చేయాలనే కోరిక వుండేది. దాని ఫలితంగానే తను ఆపరేషన్ చేయించుకున్న తర్వాత, అక్కడ్నుంచి పాపను తెచ్చుకుందామన్నారు. నేను ముందు ఒప్పుకోలేదు. వాళ్ళకు సాయం చేయాలంటే ఆర్థికంగా చందాల రూపంలోగానీ, వస్తురూపంలోగానీ ఏదైనా యివ్వవచ్చునని వాదించాను. ఆయన తను పట్టిన పట్టు విడవ లేదు. నేను చెప్పిందేదీ నిజమైన సహాయం కానేకాదన్నారు. ఆయనకు ఎదురు మాట్లాడే శక్తి నాకెప్పుడూ లేదు. ముందు కొంచెం అయిష్టంగానే ఒప్పుకున్నా, నిన్ను అక్కడ్నుంచి తెచ్చుకున్నాక, అదంతా మరిచిపోయాను. ఆ నాటికి నీకు పూర్తి మూడునెలలు కూడా నిండలేదు. నువ్వు ఎక్కడి నుంచి వచ్చావో ఆ అధికారులక్కూడా తెలీదు. ఎవరో ఒకతను పసిపాపను తెచ్చి, వివరాలు చెప్పడానికి తనకే తెలీదని, ఎక్కడో దొరికిందని చెప్పాడనీ వాళ్ళన్నారు.

శారూ! ఈ రోజు నీ సంస్కారం ఎలాంటిదో, నీ అలవాట్లు, ఆచారాలు ఎలాంటివో నీకే తెలుసు. వాటి మీద నీ వంశం, రక్తం-ఇత్యాదుల ప్రభావాలు వుండవచ్చు. కాని మా పెంపకం ద్వారా సంక్రమించిన గుణాలే ఎక్కువని నువ్వూ ఒప్పుకుంటావనుకుంటాను.

మనలో ఒక సామెత వుంది చూడు. పిల్లల్ని కనగలం గాని, వాళ్ళ రాతల్ని కనలేమని. అదే కాదు. వాళ్ళ స్వభావాల్ని కూడా కనలేం. మనిషి వ్యక్తిత్వం కేవలం అతనికి వంశపారంపర్యంగా వచ్చే గుణాలపైనే ఆధారపడి వుండదు. పెరిగే వాతావరణం, పెంచే విధానం, చదివే పరిసరాలు- వీటన్నిటికీ ఈ విషయంలో ఎంతో ప్రాధాన్యం వుంది.

## మరువరాని రోజులు

మరువరాని రోజులు
మరల రాని రోజులు

జవ్వన మను వనపు నీడ
మరుల విరులు కురియు వేళ
ఏటి దారి, నీటి దారి
ఎవరు లేని ఒంటి దారి
కనులు కనులు కలిపి, కలిపి
కవితలెన్నో వ్రాసినాము
భాష కంద రాని యట్టి
బాస లెన్నో చేసినాము

కరిగి పోయె కన్న కలలు
విరిగి పోయె ఆశ అలలు
తరిగి పోయె ప్రేమ సుధలు
పెరిగి పోయె బ్రతుకు వ్యధలు
చితికి పోయె జీవితాలు
మిగిలి పోయె జ్ఞాపకాలు
శిథిల హృదయ స్మృతి పథముల
చిగురించెను ఈ కవితలు!

—గౌరి

నీకు విద్య వుంది. లోకజ్ఞానం వుంది. విన్నది ఆలోచించి, అర్థం చేసుకునే సంస్కారం వుంది. నీకింతకంటే వివరంగా చెప్పాల్సిన అవసరం లేదని నా నమ్మకం.

శారూ, చివరగా ఒక మాట. నువ్వు నా సలహా పాటించినా, పాటించకపోయినా, నేనేమీ అనుకోను. కాని, నీ నిర్ణయం ఏదైనా మనిద్దరి మధ్య, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే. మా యిద్దరికీ, నీకూ వున్న అనుబంధానికి ఎలాంటి ఆటంకమూ రాకూడదని నా కోరిక. నీపైన మాకెంత అభిమానం, వాత్సల్యం వున్నాయో నీకు తెలుసు. నేనీ రహస్యాన్ని నీకు చెప్పడం వల్ల, మా ప్రేమను నువ్వు శంకించడం గాని, మమ్మల్ని పరాయి వాళ్ళుగా భావించడం గానీ జరుగుతుందేమోనని మొదట్లో భయపడ్డాను. కాని నీ మనసు నాకు తెలుసు. అందుకే ధైర్యంగా చెప్పగలిగాను.

నువ్వు నిర్ణయం తీసుకునే ముందు, ఒక్క ప్రశ్న వేసుకో. నువ్వెరోజైనా అనాథలా ఫీలయ్యావా? ఆలోచించు, శారూ, ఆ భావం నుంచి మరో మనిషిని రక్షించే అవకాశం నీకు వుంది. నువ్వు సుమతి యింటి నుంచి పాపను తెచ్చుకొని, సుఖమైన జీవితం ఇవ్వగలవేమోగాని, సంతోషకరమైంది ఇవ్వగలవన్న గ్యారంటీ లేదు, దీన్లో రెండూ వున్నాయి.

ఇంతకంటే నేను చెప్పేదేమీ లేదు. త్వరలో నీ నిర్ణయాన్ని తెలియజేస్తావని ఆశిస్తూ,

ప్రేమతో
అమ్మ''

ఉత్తరం పూర్తి చేసి, అరగంట గడిచినా, శర్వాణి కుర్చీలోంచి లేవలేదు. 'తన తల్లిదండ్రులెవరో ఎవరికీ తెలీదు. తను అనాథ! తను మరో అనాథను పెంచుకోబోతోందా?'

శర్వాణి కుర్చీలో వెనక్కి వాలి, కళ్ళు మూసుకుంది. క్రమంగా ఆమె ముఖంలో ప్రశాంతత చోటు చేసుకుంది. పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. 'తను అనాథగానే పుట్టింది. కానీ అనాథగా పెరిగిందా?....అలాగే....అలాగే....తన ప్రేమనీడలో పెరగబోయే పాప అనాథే అవుతుందా?'

శర్వాణి కుర్చీలోంచి లేచింది. టేబిల్ మీద వున్న లెటర్‌పాడ్ అందుకుంది. అమ్మకి ఉత్తరం రాయడానికి కలం చేతిలోకి తీసుకుంది! □

## మల్లెపందిరి ముగ్గు

మొదట 12 చుక్కలు 4 వరుసల్లో పెట్టుకోవాలి. తర్వాత రెండు వైపులా 14 చుక్కలు 2 వరుసల్లో, 12 చుక్కలు 2 వరుసల్లో, 4 చుక్కలు 1 వరుసలోనూ పెట్టుకోవాలి. ఆ తర్వాత చిత్రంలో చూపినట్లుగా కలుపుకుంటూ వస్తే ఈ మల్లెపందిరి ముగ్గు పూర్తవుతుంది.

—శారదా జనార్ధన్, బెంగళూరు



